# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- 'సీఎంఎస్-03' ఉపగ్రహ ప్రయోగం విజయవంతంతో ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోందని చైర్మన్ వి. నారాయణన్ పేర్కొన్నారు.
- నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాలు.. ప్రజలు ప్రామాణికమైన సమాచారాన్ని పొందే జ్ఞాన కేంద్రాలుగా పని చేస్తున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు.
- మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్ దక్షిణాఫ్రికాకు 299 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

=========================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైంది. 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక ద్వారా ఈ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహం బరువు 4 వేల 410 కిలోలు. భారత భూభాగం నుంచి స్వదేశీ రాకెట్ ద్వారా ఈ కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాలన్నింటిలోనూ ఇదే అత్యంత బరువైనది. ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇందులో కీలకపాత్ర పోషించిన అందరికీ అభినందనలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఉన్న పతంజలి విశ్వవిద్యాలయం 2వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ఈ రోజు పాల్గొని ప్రసంగించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల, పురుషుల సమాన భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. విద్యలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. మహిళా విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని రాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా రాష్ట్రపతి డెహ్రాడూన్‌లో రేపు జరిగే ఉత్తరాఖండ్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ప్రసంగించనున్నారు. నైనిటాల్ రాజ్ భవన్ స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగే వేడుకలో ద్రౌపది ముర్ము పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేటి డిజిటల్ యుగంలో గ్రంథాలయాలు.. ప్రజలు ప్రామాణికమైన సమాచారాన్ని పొందే జ్ఞాన కేంద్రాలుగా పని చేస్తున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.  అంతర్జాతీయ గ్రంథాలయాల సాధికారత సమాజాల సమావేశం - ప్రపంచ దృక్పథాలపై ఈ రోజు జరిగిన అంతర్జాతీయ సమావేశంలో దృశ్య మాధ్యమ విధానంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. గ్రంథాలయాన్ని ఒక అభ్యాస దేవాలయంగా ఆయన అభివర్ణించారు. కేరళలో 80 సంవత్సరాల గ్రంథాలయ ఉద్యమాన్ని, గ్రంథాలయాలను శక్తివంతమైన సమాజ కేంద్రాలుగా మార్చాలనే పి.ఎన్. పాణికర్ దార్శనికతను రాధాకృష్ణన్ ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం CMS-03 విజయవంతంగా ప్రయోగించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా అభినందించారు. దేశ అంతరిక్ష శాస్త్రవేత్తలు అందించిన ఈ విజయాలు జాతీయ పురోగతిని మరింతగా పెంచాయన్నారు. అంతరిక్ష రంగం శ్రేష్ఠత, ఆవిష్కరణలకు పర్యాయపదంగా మారిందని ప్రధానమంత్రి ప్రశంసించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా దేశవ్యాప్తంగా పౌరులకు ప్రయోజనం చేకూరుతున్నది. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎలా ఉపయోగపడుతున్నాయో తెలుసుకుందాం. జీఎస్టీ సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రంగాలలో గణనీయమైన వృద్ధి అందిస్తున్నాయి. చేప నూనెలు, సంరక్షించబడిన ఉత్పత్తులు, ఫిషింగ్ గేర్, డీజిల్ ఇంజిన్లపై GST రేటును 5 శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం పన్ను భారాన్ని తగ్గించి, తీరప్రాంత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. GST 2.0లో అరకు కాఫీ, తోలు బొమ్మలు, రాతి చెక్కడం వంటి ప్రత్యేక ఉత్పత్తులపై 12 శాతం నుండి 5 శాతానికి పన్ను రేటు తగ్గింది. ఇది స్థానికంగా జీవనోపాధిని మెరుగుపరచడమే కాకుండా రాష్ట్ర ఎగుమతులకు ప్రోత్సాహంగా నిలుస్తుంది. 350 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగి ఉన్న త్రిచక్ర వాహనాలు, చిన్న కార్లు, మోటార్ సైకిళ్లపై GSTని 18 శాతానికి తగ్గించడంతో ఆటోమొబైల్స్ వినియోగదారులకు మరింత లాభదాయకంగా మారింది. ఆటో విడిభాగాల ఎగుమతికి ప్రోత్సాహం లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎమర్జింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ESTIC)2025ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో రేపు ప్రారంభించనున్నారు. దేశంలో పరిశోధనలు అభివృద్ధి (R&D) ఎకో సిస్టమ్ ను ప్రోత్సహించడానికి లక్ష కోట్ల రూపాయల విలువైన పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ పథకం నిధిని కూడా ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. భారతదేశపు సైన్స్ అండ్ టెక్నాలజీ ఎకో సిస్టమ్ ను బలోపేతమవడంతో పాటూ యువ ఆవిష్కర్తలు, పరిశోధకులు, పరిశ్రమలు అనుసంధానమయ్యేందుకు మూడు రోజుల పాటు జరిగే ఈ కాంక్లేవ్ వేదిక కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్ దక్షిణాఫ్రికాకు 299 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నవీముంబయి లోని డివై పాటిల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ నిర్ణీత 50 ఓవర్లు పూర్తయే సరికి 7 వికెట్లు నష్టపోయి 298 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో షెఫాలి వర్మ 87 పరుగులు, దీప్తి శర్మ 58 పరుగులు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. దేశంలోని వాతావరణ పరిస్థితులను ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బహ్రెయిన్‌లో జరిగిన 2025 ఆసియా యువ క్రీడల్లో 48 పతకాలు సాధించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. దేశంలోని యువ అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రదర్శనతో ఈ క్రీడల్లో చరిత్ర సృష్టించారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ప్రశంసించారు. ఈ అథ్లెట్ల గెలుపులో దృఢ సంకల్పం, కృషి స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలాంటి హింసాత్మక చర్యలను సహించబోమని, ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరిస్తుందని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఓటర్లు శాంతియుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రత, సైన్యానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ రోజు  ఆరాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ... జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని తెలిపారు. ఉగ్రవాదులను వారి గడ్డపైనే శిక్షించాలని ప్రతిజ్ఞ చేసి, ఆపరేషన్ సిందూర్ రూపంలో దాన్ని నెరవేర్చామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =